గురువారం 19-09-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 460 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com


## జమిలి ఎన్నికలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

### దేశంలో వన్ నేషన్-వన్ ఎలక్షన్

శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశం



ముందడుగు జాతీయం:

దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో వన్ నేషన్‌వన్ ఎలక్షన్ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ అందజేసిన రిపోర్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎట్టి పరిస్థితుల్లోనైనా జమిలి ఎన్నికలు నిర్వహించి తీరుతామని ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్న విషయం తెలిసిందే. మిగతా 2లో


## ప్రజాస్వామ్యం మరింత శక్తివంతం

జమిలి ఎన్నికలపై మోడీ ఎక్స్ వేదికగా స్పందన




ముందడుగు జాతీయం:

దేశంలో ప్రజాస్వామ్యం మరింత శక్తిమంతంగా, భాగస్వామ్యయుతంగా మార్చే కీలక ముందడుగు జమిలి విధానమని ప్రధానమంత్రి మోడీ ఎక్స్ వేదికగా స్పందించారు. దేశంలో జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న కమిటీ సిఫార్సులను ఆమోదించింది. దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఉన్నత స్థాయి కమిటీకి మిగతా 2లో




పదేళ్ల తర్వాత జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు

మిగతా 3లో



పూలు పూసిన తర్వాత మొక్క చనిపోతుంది

మిగతా 3లో



లెబనాన్‌లో ఎందుకు పేజర్ వాడుతున్నారు..

మిగతా 4లో



రోజూ ఆల్కహాల్ తీసుకుంటున్నారా...

మిగతా 5లో

## దేశంలో జమిలి ఆచరణ సాధ్యం కాదు

- ప్రతిపాదనను ప్రజలెవరూ అంగీకరించరు
- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే

ముందడుగు జాతీయం:



దేశంలో వన్ నేషన్, వన్ ఎలక్షన్స్ ఆచరణ సాధ్యం కాదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అన్నారు. కేంద్రం ఈ ప్రతిపాదనను ప్రజలెవరూ అంగీకరించని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అసలు సమస్యల నుంచి దృష్టి మరల్చేందుకు బీజేపీ ఇలా చేస్తుందని ఖర్గే ఆరోపించారు. వన్ నేషన్, మిగతా 2లో

## వ్యవసాయ రంగంలో యువత ఎదగాలి

ఉపాధి కల్పించే పరిశ్రమలు కావాలి

ప్రతి ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం కోసమే


ఎంఎస్ఎంఈ నూతన పాలసీ విడుదల చేసిన రేవంత్ రెడ్డి



03

ముందడుగు
గురువారం, 19-09-2024, హైదరాబాద్

# జమిలి ఎన్నికలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం



(మొదటిపేజీ తరువాయి)
రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ వన్ నేషన్‌వన్ ఎలక్షన్ ప్రతిపాదన చేసింది. సెప్టెంబర్‌లో ఆ ప్యానెల్ ఏర్పాటైంది. లోక్‌సభ ఎన్నికలకు ముందే కోవింద్ ప్యానెల్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. న్యాయశాఖ ఆ రిపోర్టును ఇవాళ కేంద్ర క్యాబినెట్ ముందు ప్రవేశపెట్టింది. వంద రోజుల మోదీ సర్కార్ పాలన సందర్భంగా ఈ రిపోర్టును ముందుకు తీసుకువచ్చారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని కోవింద్ కమిటీ ప్రతిపాదించింది. కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలను చూసేందుకు ఇంప్లిమెంటేషన్ గ్రూపును ఏర్పాటు చేశారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది. ఇక మున్సిపాల్టీలు, పంచాయితీ ఎన్నికలకే రాష్ట్ర ఎన్నికల కమీషన్ నిర్వహిస్తుందని రిపోర్టులో తెలిపారు.

# వ్యవసాయ రంగంలో యువత ఎదగాలి

ముందడుగు హైదరాబాద్:

వ్యవసాయ రంగంలో యువత ఎదిగే విధంగా తమ ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంఎస్‌ఎంఈ నూతన పాలసీని సీఎం విడుదల చేశారు. తాము చేసే ప్రతి ప్రయత్నమూ రాష్ట్ర భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. యువతకు వ్యవసాయం, పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టేందుకు తగిన చేయూతనిస్తామని వెల్లడించారు. వ్యవసాయ రంగంలో యువత ఎదిగేవిధంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామన్నారు.



"దేశ ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పుడు పీవీ నరసింహారావు కృషిని మనం జ్ఞాపకం చేసుకోవాలి. ప్రపంచంతో పోటీపడేలా పీవీ ఆర్థిక విధానాలు తీసుకొచ్చారు. విధానాల రూపకల్పనలు లేకుండా రాష్ట్రం అభివృద్ధి చెందదు. రాష్ట్రంలోని విద్యార్థుల్లో స్కిల్ అప్‌గ్రెడేషన్ చేయడానికి కృషి చేస్తున్నాం. పరిశ్రమలకు గత ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీలను చెల్లిస్తాం. కొవిడ్ వ్యాక్సిన్ తయారీలో కూడా మనం రాష్ట్రం ముందుంది. ఐటీ, ఫార్మా అభివృద్ధికి కాంగ్రెస్ ఎంతో కృషి చేసింది. రాష్ట్రంలో ప్రతి ఏడాది లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు. ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం అన్నారు.

# ప్రజాస్వామ్యం మరింత శక్తివంతం

(మొదటిపేజీ తరువాయి)
నాయకత్వం వహించినందుకు, నివేదిక రూపకల్పనలో భాగంగా అన్ని వర్గాలతో విస్తృత చర్చలు జరిపినందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు అభినందనలు తెలిపారు.
'ఒక దేశం ఒకే ఎన్నికలు' విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సులభతరం అవుతుందని, తద్వారా వేగవంతమైన ఆర్థికాభివృద్ధి సాధ్యమని కమిటీ తన నివేదికలో పేర్కొంది. పదేపదే ఎన్నికల వల్ల వలస కార్మికులు పలుమార్లు ఓటేయడం కోసం సెలవులపై తమ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని.. దీంతో ఉత్పత్తిలో అంతరాయం కలుగుతోందని వెల్లడించింది. దీన్ని నివారించాలంటే జమిలి ఎన్నికలే ఏకైక పరిష్కారమని పేర్కొంది. దీనికి సంబంధించిన బిల్లును పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. 18 రాజ్యాంగ సవరణలను ప్యానల్ సిఫార్సు చేసింది.

# కోల్‌కతా కేసులో కీలక ఆధారాలు నాశనం..

## బెంగాల్ పోలీసులపై సీబీఐ ఆరోపణలు

ముందడుగు పశ్చిమబెంగాల్:

పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య కేసును సీబీఐ దర్యాప్తు చేపట్టింది. సీబీఐ చేపట్టిన ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. అత్యాచార ఘటనలో పోలీసుల తీరుపై దర్యాప్తు సంస్థ అనుమానం వ్యక్తంచేస్తోంది. ఈ ఘటన తర్వాత నిందితుడికి సంబంధించిన వస్తువులను ఆలస్యంగా స్వాధీనం చేసుకోవడమే అందుకు కారణం. తొలుత ఈ కేసును బెంగాల్ పోలీసులు దర్యాప్తు చేశారు. అయితే ఆ విచారణపై అనుమానాలు వ్యక్తమవడంతో కోల్‌కతా హైకోర్టు ఆ కేసును సీబీఐకి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. వైద్యురాలిపై అఘాయిత్యం జరిగిన రెండు రోజుల తర్వాత నిందితుడు సంజయ్‌రాయ్ దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని సీబీఐ ఆరోపించింది. ఒకవేళ వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని ఉంటే సాక్ష్యాధారాలు దొరికే అవకాశం




ఉండేదని తెలిపింది. అప్పుడు కేసులో కొంతవరకు పురోగతి కనిపించేదని పేర్కొంది.

# దేశంలో జమిలి ఆచరణ సాధ్యం కాదు

(మొదటిపేజీ తరువాయి)
వన్ ఎలక్షన్ కమిటీ నివేదికపై కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంతో తాము విభేదిస్తున్నామని ఖర్గే వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం పనిచేయదన్నారు. మన దేశ ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే అవసరమైనప్పుడు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఖర్గే పేర్కొన్నారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు'పై మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. ఈ జమిలి ఎన్నికలపై ప్రతిపక్ష పార్టీల్లో అంతర్గత ఒత్తిడి పెరిగిపోయిందని ఆరోపించారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు సంబంధించిన చేసిన సంప్రదింపుల ప్రక్రియలో 80 శాతానికి పైగా ప్రజలు సానుకూల దృక్పథంతో ఉన్నట్లు మంత్రి తెలిపారు. మరీ ముఖ్యంగా ఈ ఒకే దేశం ఒకే ఎన్నికపై యువత చాలా ఆశాజనకంగా ఉన్నారని అశ్విన్ వైష్ణవ్ చెప్పుకొచ్చారు.



ముందడుగు
గురువారం, 19-09-2024, హైదరాబాద్

# పదేళ్ల తర్వాత జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు

## తొలి దశలో 24 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్

ముందడుగు జమ్మూకశ్మీర్:

జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతుంది. తొలి దశలో 24 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా సాయంత్రం వరకు కొనసాగింది. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగడం పదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. అంతేకాకుండా 2019లో కేంద్రం రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని రద్దు చేసి, కేంద్ర పాలిత ప్రాంతాలుగా పునర్వ్యవస్థీకరించిన తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో జరుగుతున్న మొదటి అసెంబ్లీ ఎన్నికలు కూడా ఇవే. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రజల దృష్టి జమ్మూ కశ్మీర్ ఎన్నికలపై ఉంది. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జమ్మూ కశ్మీర్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో అత్యధికంగా ఓటింగ్ జరిగేలా అసెంబ్లీ ఎన్నికల కోసం పోలీసులు విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీనియర్ అధికారి వీకే బిర్ది తెలిపారు.

తొలిదశలో పీర్ పంజాల్ పర్వత శ్రేణికి ఇరువైపులా ఏడు జిల్లాల్లో విస్తరించి ఉన్న 24 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుంది. తొలి దశలో 23 లక్షల మంది ఓటర్లు 90 మంది స్వతంత్ర అభ్యర్థులతో సహా 219 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. ఎన్నికల సంఘం ప్రకారం.. ఫేజ్ 1లో మొత్తం 23,27,580 మంది ఓటర్లు ఓటు వేయడానికి అర్హులు. వీరిలో 11,76,462 మంది పురుషులు, 11,51,058 మంది మహిళలు, 60 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. మొత్తం 14,000 మంది పోలింగ్ సిబ్బంది.. 3,276 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలను నిర్వహిస్తున్నారు. ఇక, జమ్మూ కశ్మీర్ రెండో దశ ఓటింగ్ సెప్టెంబర్ 25న, మూడో దశ అక్టోబర్ 1న జరగనుంది. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు అక్టోబర్ 8న జరగనుంది.



# తెలంగాణలో ప్రతి గ్రామానికి ఇంటర్నెట్

- ప్రయోగాత్మకంగా మూడు గ్రామాలు ఎంపిక
- టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ ఫైబర్ నెట్‌వర్క్
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

ముందడుగు తెలంగాణ:




తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి త్వరలో ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం రోజున కరీంనగర్‌లో జరిగిన 'ప్రజాపాలన' కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు. అనంతరం స్థానిక ఆర్అండ్‌బీ గెస్టు హౌస్‌లో మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో టీఫైబర్ ద్వారా ఇంటర్నెట్ ఫైబర్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా సంగుపేట, నారాయణపేట జిల్లా మద్దూరు, పెద్దపల్లి జిల్లా అడవి శ్రీరాంపూర్ గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకున్నామని.. ఈ గ్రామాల్లో పూర్తి స్థాయిలో నెట్‌వర్క్ విస్తరణను ప్రయోగాత్మకంగా చేపట్టనున్నట్టుగా తెలిపారు. అంతే కాకుండా ఈ గ్రామాల్లో 360 డిగ్రీస్‌లో ఏఐ ఫీచర్లతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెండు నెలల్లో పైలెట్ ప్రాజెక్టు పూర్తి చేసి.. అక్కడ ఏవైనా సాంకేతిక పరమైన లోపాలు ఎదురైతే వాటిని గుర్తించి, ఇంకా ఎలాంటి సదుపాయాలు కల్పిస్తే బాగుంటుందా అనే విషయాలను పరిశీలిస్తామని చెప్పారు. ఇంటర్నెట్‌తో పాటు, కేబుల్ టీవీ సేవలుకు 20 MBPS అపరిమిత డేటా కూడా ఆప్టిక్ ఫైబర్ కేబుల్ ద్వారా అందించబడుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇప్పటికే 8000 గ్రామాలకు ఫైబర్ కేబుల్ అందించామని, మరో 3 వేల గ్రామాలకు విస్తరించాల్సి ఉందన్నారు.



# పూలు పూసిన తర్వాత మొక్క చనిపోతుంది

## 12 ఏళ్లకు ఒక్కసారి పూసే నీలకురింజి మొక్క

ముందడుగు తమిళనాడు:

నీలకురింజి మొక్కలకు ఒక ప్రత్యేకత ఉంది.. ఎందుకంటే ఈ మొక్కలు సాధారణ పూల మొక్కల్లా ఎప్పటికి పూలు పూయవు. 12 ఏండ్లకు ఒక్కసారి మాత్రమే పూలు పూస్తాయి. ఈ మొక్కలు జీవితకాలంలో ఒక్కసారే పూతకు వస్తాయి. పూలు విరబూసిన తర్వాత మొక్కలు చనిపోతాయి. ఇక ఈ మొక్కలకు పూసే నీలకురింజి పూల అందాలను వీక్షించేందుకు రెండు కళ్లూ చాలవు.

తాజాగా తమిళనాడు రాష్ట్రం నీలగిరి జిల్లాలోని పిక్కపాటి మందు అనే గిరిజన గ్రామాన్ని ఆనుకుని ఉన్న కొండలపై నీలకురింజి పూలు విరబూశాయి. దీంతో ఆ ప్రాంతానికి ప్రత్యేకమైన కళ వచ్చింది. కనుచూపు మేర కొండ మొత్తం నీలకురింజి పూలు కనువిందు చేస్తున్నాయి. ఈ పూల అందాలను వీక్షించేందుకు చుట్టుపక్కల నుంచి స్థానికులు పెద్ద ఎత్తున ఇక్కడికి తరలి వస్తున్నారు. ఈ మొక్కలు పన్నెండేండ్లు పెరిగి పూలు పూసిన తర్వాత చనిపోతాయట. అలా వాటి విత్తనాలతో మొలకెత్తే కొత్త మొక్కలు పూతకు రావడానికి మళ్లీ 12 ఏండ్లు పడుతుందట. ఈ పూలు నీలం రంగులో ఉండటం వల్ల వీటికి నీలకురింజి పుష్పాలు అనే పేరు వచ్చిందట.

ముందడుగు
గురువారం, 19-09-2024, హైదరాబాద్

## మహిళలకు ఉత్సాహాన్ని కలిగించే
# సిల్క్ ఎక్స్‌పో

### సత్యసాయి నిగమాగమంలో 9 రోజుల లైవ్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో



ముందడుగు హైదరాబాద్:

దేశవ్యాప్తంగా మహిళలను ఆకర్షించే అన్ని రకాల ఉత్పత్తుల హ్యాండ్లూమ్ ఎక్స్‌పోను హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ప్రారంభమయింది. ఈ లైవ్ హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పోను తొమ్మిదిరోజుల పాటు కొనసాగుతోంది. ఈ ఎక్స్‌పోను బుధవారం మల్లా రెడ్డి విశ్వ విద్యాపీఠ్ వైస్ చైర్మన్ డాక్టర్ సి.ప్రీతి రెడ్డి ప్రారంభించారు. ఆసియా పసిఫిక్ మరియు షో కోచ్, సోషలిస్ట్ సుధా జైన్, లైవ్ హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో వ్యవస్థాపకురాలు శ్రీమతి శైలజా యముసామి పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవంలో డాక్టర్ సిహెచ్ ప్రీతి రెడ్డి మాట్లాడుతూ "ఎగ్జిబిషన్‌లు ఎల్లప్పుడూ మహిళలకు ఉత్సాహాన్ని కలిగిస్తాయి మరియు ఈ హ్యాండ్‌లూమ్ సిల్క్ ఎక్స్‌పోకు నన్ను ఆహ్వానించినందుకు సంతోషిస్తున్నాను. ప్రతి స్టాల్ ప్రత్యేకంగా ఉన్నాయి. ప్రతి స్టాల్ వివిధ రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. ఇక్కడ కొన్ని కొనుగోళ్లను ఒకే పైకప్పు క్రింద ఉంచడం చాలా అద్భుతంగా ఉంది అన్నారు.

లైవ్ హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో సెప్టెంబర్ 18 నుండి 26, 2024 వరకు ప్రతిరోజూ ఉదయం 11 నుండి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుంది, సందర్శకులకు భారతదేశం అంతటా అనేక రకాల ప్రామాణికమైన చేనేత ఉత్పత్తులను అన్వేషించడానికి మరియు కొనుగోలు చేయడానికి అవకాశం కల్పిస్తుంది.

# లెబనాన్‌లో ఎందుకు పేజర్ వాడుతున్నారు..

### లోకేషన్ ట్రాకింగ్ చేయడం వీలు కాదు
### ఇప్పటికి పేలిన పేజర్లు సుమారు ఐదు వేలు





ముందడుగు: లెబనాన్ దేశంలో పేజర్ పేలడం ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎప్పుడో ఒకప్పుడు వాడిన పేజర్ మళ్లీ ఇప్పుడు ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. పేజర్‌ను బీపర్ అని కూడా పిలుస్తారు, ఇది ఏదైనా సంక్షిప్త సందేశాలు స్వీకరించడానికి మరియు కొన్ని సందర్భాల్లో సంక్షిప్త సందేశాలు లేదా హెచ్చరికలను పంపడానికి రూపొందించబడిన చిన్న, పోర్టబుల్ ఎలక్ట్రానిక్ డివైజ్.

**పేజర్ ఎందుకు ఉపయోగిస్తారు?**

1990ల చివరలో మరియు 2000ల ప్రారంభంలో మొబైల్ వినియోగంలో రాకముందు పేజర్లు వినియోగించారు. తొందరగా మరియు విశ్వసనీయమైన కమ్యూనికేషన్‌కు అవసరమైన పనిచేసేవారికి ఈ టూల్ ఉపయోగపడుతుంది. దీంతో పేజర్ ఎంతో గుర్తింపు పొందింది. వైద్యులు, నర్సులు మరియు అత్యవసర సేవల సిబ్బంది సెల్యులార్ నెట్‌వర్క్‌లపై ఆధారపడకుండా ఉండేందుకు ఉపయోగిస్తారు.

**పేజర్లు ఎన్ని రకాలు ?**

పేజర్లు ప్రధానంగా రెండు రకాలు....

న్యూమరిక్ పేజర్స్‌లో కేవలం నంబర్స్ మాత్రమే కనిపిస్తాయి. ఏదైనా ఫోన్ నంబర్‌కు కాల్ చేయమని లేదా పేజ్‌కు స్పందించమని మెసేజ్ వస్తుంది. న్యూమరిక్ పేజర్స్ అనేది బేసిక్ టైప్ పేజర్. ఆల్ఫాన్యూమరిక్ పేజర్స్...కేవలం లెటర్స్ మరియు నంబర్స్ మరియు టెక్స్ట్ కమ్యూనికేషన్స్ ఉంటాయి. మొబైల్ ఫోన్‌లతో పోలిస్తే పేజర్‌లు సాధారణంగా ఎక్కువ కవరేజ్ ఏరియాను కలిగి ఉంది, ముఖ్యంగా సెల్యులార్ సిగ్నల్‌లు వీక్‌గా ఉండే మారుమూల ప్రాంతాలలో మరియు అందువల్ల ఇవి ఎంతో నమ్మకమైనవి. ప్రస్తుతం ఈ పేజర్లను చాలా తక్కువ మంది ఉపయోగిస్తున్నారు. పేజర్లను లిథియం బ్యాటరీలతో రూపొందిస్తారు. లిథియం బ్యాటరీలు వేడెక్కగల సామర్థ్యాన్ని కల్గి ఉంటుంది. ఇవి వేడి చేయడం వల్ల లిథియం బ్యాటరీ కరిగి పేలిపోయి మంటలు వ్యాపించే అవకాశం ఉంటుంది.

**లెబనాన్‌లో వాడడానికి కారణం**

టెక్నాలజీ ఎంతో పెరిగినప్పటికీ ఇప్పటికీ లెబనాన్‌లో హిజ్బుల్లా గ్రూప్ పేజర్స్‌నే వినియోగిస్తున్నారు. తక్కువ టెక్నాలజీ ఉన్నటువంటి పేజర్స్ వినియోగం వల్ల వారి లోకేషన్ ట్రాకింగ్ చేయడం వీలు కాదు. పలు మీడియా కథనాల ప్రకారం సుమారుగా 5వేల పేజర్స్ పేలుళ్లు జరిగాయి.

## న్యాయం చేయాలంటూ
# ఆరోగ్య శ్రీ ఉద్యోగుల ఆందోళన

ముందడుగు హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆరోగ్య శ్రీ ఉద్యోగులు న్యాయం కావాలని కోరుతూ హైదరాబాద్ లో ఆరోగ్య శ్రీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. జీవో నెంబర్ 60 ప్రకారం వెంటనే వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ విధానాన్ని వెంటనే రద్దు చేసి, డిపిఓ క్యాడర్ ని కల్పించాలన్నారు. ఆరోగ్యశ్రీ ఉద్యోగులందరికీ హెల్త్ కార్డు సౌకర్యాన్ని కల్పించాలి. ఆరోగ్యశ్రీలో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. కనీస వేతనంగా 35000 రూపాయలతో పాటు టిఏ, డిఏ సౌకర్యాన్ని కల్పించాలి. ఆరోగ్య శ్రీ ఉద్యోగులను ట్రస్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి.



మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను అమలుచేయాలి అమలుచేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగులు ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ముందు పెద్ద ఎత్తును ఆందోళనకు దిగారు. తమ డిమాండ్లు నేరవేర్చేవరకు ఆందోళన విరమించేది లేదన్నారు.

# కోవిడ్ కొత్త వేరియంట్ ఎక్స్ఈసీ కలకలం

### అంటువ్యాధిలా విస్తరిస్తున్న వైరస్.. ఇప్పటికే 27 దేశాలకు వ్యాప్తి

ముందడుగు జాతీయం:

ప్రపంచవ్యాప్తంగా మరో కొత్త కరోనా వేరియంట్ ఎక్స్ఈసీ తెరమీదకు వచ్చింది. ప్రస్తుతం ఈ వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఈ వేరియంట్‌ను మొదటిసారిగా 2024 జూన్‌లో జర్మనీలో గుర్తించగా.. పలు దేశాలకు వ్యాప్తి చెందింది. డెన్మార్క్, జర్మనీ, యూకే, నెదర్లాండ్స్‌లో ఈ వేరియంట్ వేగంగా వృద్ధి చెందుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటివరకు 27 దేశాల నుంచి సేకరించిన 500 నమూనాలలో ఎక్స్ఈసీ ఉన్నట్లు కనుగొనబడింది. ఈ వేరియంట్ ఇప్పటికే యూరప్‌లో అంటు వ్యాధిలా విస్తరిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రెండు ఒమిక్రాన్ సబ్ వేరియంట్స్ నుంచి పుట్టుకొచ్చిన వేరియంట్‌గా ఎక్స్ఈసీని పేర్కొంటున్నారు. గతంలో ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేసిన ఒమిక్రాన్ సబ్‌వేరియంట్‌లు KS.1.1, KP.3.3ల నుంచి పుట్టుకొచ్చిన హైబ్రిడ్ రకంగా దీనిని చెబుతున్నారు. ఎక్స్ఈసీ వేరియంట్ ఎంత ప్రమాదకరమో ఇంకా స్పష్టంగా తెలియలేదు. అయితే ఒమిక్రాన్ సబ్ వేరియంట్‌ల కలయిక నుంచి ఆవిర్భవించిన వేరియంట్ కావడంతో శాస్త్రవేత్తలు.. దాని వ్యాప్తి, ప్రమాద తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేరియంట్‌ను ఎదుర్కొనేందుకు వ్యాక్సిన్ బూస్టర్ డోస్ తీసుకోవటం చాలా అవసరమని వైద్య నిపుణులు అంటున్నారు.

ముందడుగు
గురువారం,
19-09-2024,
హైదరాబాద్



# రెమ్యునరేషన్ అమాంతం పెంచేసిన తృప్తి డిమ్రి..!

చాలా రోజులుగా సోషల్ మీడియాను షేక్ చేస్తున్న భామల్లో టాప్‌లో ఉంటుంది తృప్తి డిమ్రి (Triptii Dimri). యానిమల్ సినిమాలో అందాలు ఆరబోసి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ బ్యూటీ అతి తక్కువ కాలంలోనే బాలీవుడ్‌లో వన్ ఆఫ్ ది బిజీయెస్ట్ హీరోయిన్‌గా మారిపోయింది. మరోవైపు బ్యాడ్ న్యూజ్ కూడా మంచి వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ ఇప్పుడు బీటౌన్ దర్శకనిర్మాతలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదిలా ఉంటే ఈ భామ తన రెమ్యునరేషన్‌ను భారీగా పెంచేసిందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం తృప్తి డిమ్రి రూ.6 కోట్ల నుంచి 10 కోట్లకు పెంచేసిందని ఇన్‌సైడ్ టాక్. కాగా తృప్తి డిమ్రి సక్సెస్ వేవ్‌లో దూసుకెళ్తుండటంతో రెమ్యునరేషన్‌ను అమాంతం పెంచేసిందన్న వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తృప్తి డిమ్రి ఖాతాలో భూల్ భులయ్యా 3, ధడక్ 2, Vicky Vidya Ka Woh Wala Video సినిమాలున్నాయి. వీటితోపాటు పలు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి.

# రోజూ ఆల్కహాల్ తీసుకుంటున్నారా...

## ఫ్యాటీ లివర్‌కు దారి తీసే అవకాశం..

## ఖాళీ కడుపుతో మద్యం చాలా ప్రమాదకరం



ముందడుగు ఆరోగ్యం:

మద్యం ఆరోగ్యానికి హానికరం.. అతిగా మద్యం తీసుకోవడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తాయి. ప్రతిరోజూ ఆల్కహాల్ తీసుకోవడం మంచిదని చాలా మంది అనుకుంటారు కానీ ఆల్కహాల్ కాలేయ సమస్యలకు దారితీస్తుంది. ఏళ్ల తరబడి తాగడం వల్ల ఫ్యాటీ లివర్‌కు దారి తీయవచ్చు. వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులు మద్యపానాన్ని మానేస్తారు కానీ వారు కోలుకున్న తర్వాత మళ్లీ తాగుతారు. ఈ అలవాటు వల్ల కాలేయం దెబ్బతింటుంది. ఎక్కువ కాలం ఆల్కహాల్ సేవించిన తర్వాత, కాలేయం తనంతట తానుగా కోలుకునే సామర్థ్యాన్ని కోల్పోతుంది. ఒక నివేదిక ప్రకారం, యువకులలో ఆల్కహాల్ సంబంధిత కాలేయ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని.. ప్రపంచవ్యాప్తంగా మొత్తం మరణాలలో 4 శాతం కాలేయ సంబంధిత సమస్యల కారణంగా సంభవిస్తున్నాయి. ఎక్కువసేపు ఆల్కహాల్ తీసుకోవడం వల్ల కిడ్నీ ఫెయిల్యూర్ కూడా వచ్చే అవకాశం ఉందని చెప్తున్నారు.

### రోజుకు 80ఎంఎల్

రోజుకు 30 ఏంఎల్ కంటే ఎక్కువ ఆల్కహాల్ తాగడం వల్ల కాలేయం దెబ్బతింటుంది. రోజుకు 80 ml కంటే ఎక్కువ ఆల్కహాల్ తీసుకోవడం కాలేయ వైఫల్యానికి దారితీయవచ్చు. అతిగా తాగడం వల్ల పేగు లైనింగ్ దెబ్బతింటుంది, దీనివల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, పురుషుల కంటే స్త్రీలు మద్యం సంబంధిత వ్యాధులకు గురవుతారు. మద్యం సేవించడం వల్ల మహిళలలో ఈజీగా కాలేయ సమస్యలు వస్తాయని పురుషుల కంటే స్త్రీల సంఖ్య ఎక్కువగా ఉందని చెప్పారు. నివేదికల ప్రకారం, ఒక వ్యక్తి ఆల్కహాల్ తీసుకున్న సమయంలో అది రక్తంలో కలిసిపోయి మానవ శరీరంలోని కొన్ని కీలక భాగాలను ప్రభావితం చేస్తుంది.

### ఖాళీ కడుపుతో చాలా ప్రమాదం..

ఖాళీ కడుపుతో మద్యం సేవించడం చాలా ప్రమాదకరం, ఎందుకంటే ఇది రక్తంలో వేగంగా కలిసిపోతుంది. శరీరంలోకి ప్రవేశించిన తర్వాత, ఆల్కహాల్ మొదట మెదడును ప్రభావితం చేస్తుంది, తరువాత కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఆల్కహాల్ శరీరంలో గ్యాస్ట్రిక్ యాసిడ్‌ను కూడా పెంచుతుంది, ఇది అల్సర్‌లకు దారితీస్తుంది. అందుకే ఆల్కహాల్‌ను ప్రతిరోజు తీసుకోవడం ఆపేయాలి.. అంతేకాదు ఆల్కహాల్‌ను ఖాళీ కడుపుతో తీసుకోవడం పూర్తిగా మానేయాలి..